## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

ముదముగాను పలుక ముప్పురాదెప్పుడు
పరులుగూడ దరికి వచ్చుచుండ్రు
మాట కఠిన మైన మననుండి అందరూ
శత్రువులుగమారు సత్యమిదియె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 50 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | ఆగస్టు 18, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## విద్య, వైద్య రంగాలకు
# అత్యంత ప్రాధాన్యం

● ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి ● విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది ● ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం ● గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు ● వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం ● కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ ● సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 17 :** తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి



అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ. 2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు

మిగతా2లో...

## కళ్యాణ,షాదీముబారక్
# కొనసాగుతుంది

● గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు ● అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి ● దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం

మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి




**హైదరాబాద్,ఆగస్టు 17 :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మి పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్‌కు

మిగతా2లో...

## 22ఎ భూములపై
# ఆందోళన వద్దు

● అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది ● అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం ● నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం ● టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి ● ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం ● మీడియా సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి వివరణ



**హైదరాబాద్,ఆగస్టు 17 :** ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ

మిగతా2లో...

## తెలంగాణలో సర్
# జాబితా విడుదల

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ
- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల




2లో



## సుప్రీంలో రాహుల్‌కు ఊరట

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత

**న్యూఢిల్లీ,ఆగస్టు 17 :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో

మిగతా2లో...

## డబ్బులు దండుకోవడానికే
# నిషేధిత జాబితా

- ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా
- మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం



**హైదరాబాద్,ఆగస్టు 17 :** రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ..

మిగతా2లో...

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు
# తొలి విమానం రాక

- ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు



**అమరావతి,ఆగస్టు 17 :** భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మిగతా2లో...

## జహీరాబాద్
# పారిశ్రామిక స్మార్ట్ సిటీ

2 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్,ఆగస్టు 17 :** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల

మిగతా2లో...

## జార్ఖండ్ జంగ్.. 23వ రోజుకు
# విద్యార్థి ఆందోళన

సీఎం సోరెన్, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మల దహనం

ఇక వ్యూహం మార్చుకుంటామన్న విద్యార్థి నేతలు

సర్కార్ దిగిరాకపోతే.. సీఎం రాజీనామాకే డిమాండ్

20న ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి పిలుపు

డిమాండ్లు నెరవేరుస్తారా.. రాజీనామా చేస్తారా

జార్ఖండ్ సీఎంకు విద్యార్థుల హెచ్చరిక..

హేమంత్, రాహుల్, తేజస్వీ యాదవ్ దిష్టిబొమ్మల దగ్ధం



2లో

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు.

టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి.2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి.. నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు.మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ,షాదీముబారక్ కొనసాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

# డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎలాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ఎలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాల యాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి..? కమిషన్ల కోసమేనా..? అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు? కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు..? దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టి న వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి. అప్పటిలోగా ఈ ఆస్తులన్నింటినీ దాని పరిధి నుంచి మినహాయించాలన్నారు .

# తెలంగాణలో సర్ జాబితా విడుదల

**హైదరాబాద్,ఆగస్టు 17:** తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ పక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు.

ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

పరిశీలన పక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ పక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

# సుప్రీంలో రాహుల్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ సుప్రీంలో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రంలో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చరిత్రాత్మక కొత్త ఆరంభమని.. ఉత్తరాంధ్రకు కొత్త గేట్‌వేగా అవతరించనుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఏపీ కొత్త శకానికి నాంది పలికిందని సీఎం వెల్లడించారు.

# 22ఏ భూములపై ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరపున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఏ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఏ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఏ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ లభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

# జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల పక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# జార్ఖండ్ జంగ్.. 23వ రోజుకు విద్యార్థి ఆందోళన

**రాంచి :ఆగస్టు 17:** జేపీఎస్‌సీ-జేఎస్ఎస్‌సీ విద్యార్థుల నిరసనలు ఆదివారంతో 23వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులు తమ నిరసనల వ్యూహాన్ని మార్చుకుంటున్నట్టు ప్రకటించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సీఎం హేమంత్ సోరెన్ రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అంతే కాకుండా ఆగస్టు 20న సీఎం ఇంటికి మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో నిరసనలు మరో మలుపు తిరిగాయి. ఆగస్టు 10న నిర్వహించిన అసెంబ్లీ మార్చ్‌లో విద్యార్థులపై పోలీసులు వాటర్ కాననన్లు, టియర్ గ్యాస్ వినియోగించడంతో పాటు లాఠీ చార్జ్ చేయడంతో అప్పటి నుంచే నిరసనలు మరింత ఉధృతంగా మారాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న వారిలో ఒకరైన పియూష్ సింగ్ మాట్లాడుతూ స్టూడెంట్లు నాలుగు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్టు చెప్పారు.జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయడం, జేపీఎస్‌సీ 11వ, 13వ పరీక్షలను రద్దు చేయడంతో పాటు టీడీపీఎల్ సంస్థతో సంబంధం ఉన్న అన్ని పరీక్షలను రద్దు చేసి ప్రస్తుతం జరుగుతున్న విచారణలను సీబీఐకి అప్పగించాలని కోరుతున్నారని వెల్లడించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఆగస్టు 20న అసలు సినిమా ఉంటుందన్నారు. సీఎం రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అయితే జేపీఎస్‌సీకి సంబంధించిన మూడు పరీక్షలను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సీజీఎల్ కు సంబంధించిన పరీక్షను రద్దు చేయడం కుదరదని.. అది కోర్టుల పరిధిలో ఉందని ఓ మంత్రి పేర్కొన్నారు. సీఎం ఇల్లు ముట్టడి ప్రకటన నేపథ్యంలో పోలీసులు ఆయన ఇంటి వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
మంగళవారం,
ఆగస్టు 18, 2026



## రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్




అమ్రాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అమ్రాబాద్ మండలంలోని చింతలోనిపల్లి గ్రామస్తులు రేషన్ కోసం పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుల తరపున చింతల సుందరయ్య ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు తాసిల్దార్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. సమీప రేషన్ షాప్‌కు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లకు పైగా నడవాల్సి వస్తోందని, దారిలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో రేషన్ సరుకులు తీసుకురావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో బురద రోడ్లు, వాగులు పొంగడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, కొన్నిసార్లు రోజంతా తిరిగి కూడా రేషన్ తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు గోడు వ్యక్తం చేశారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని గ్రామంలోనే ప్రత్యేక రేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. తాసిల్దార్ వినతిపత్రాన్ని స్వీకరించి ఉన్నతాధికారులకు పంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాన్ని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫార్వర్డ్ బ్లాక్‌లో భారీ చేరికలు



పెద్దపల్లి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : బీఆర్ఎస్ పార్టీకి పెద్దపల్లిలో షాక్ తగిలింది. పట్టణం బండారికుంట 19వ వార్డుకు చెందిన మహమ్మద్ షఫీ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తన యూత్ సభ్యులతో కలిసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. శ్రీనివాస్ నాయకత్వంలో పనిచేయడానికి పార్టీలో చేరినట్లు షఫీ తెలిపారు. ఆయనతో పాటు నవాబ్, ఎండి గౌస్, ఇంతియాజ్ ఖాన్, ఎండి అహ్మద్, ఎండి సోను, షకీల్, ఆఫీజు, చంద్ పాషా, నవీద్, హజార్ తదితరులు ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరారు. కార్యక్రమంలో కుక్క కనకరాజు, కుక్క చరణ్, మాచర్ల సాగర్, పేర్క సాయి, నరేష్, శ్రావణ్, సృజిత్, గనీ, విజయ్, శ్రీనాథ్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని బీఆర్ఎస్ డిమాండ్



పెద్దపల్లి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, ఈ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం 2014లో ప్రారంభించి, రూ.51,000 నుంచి రూ.1,00,116 వరకు ఆర్థిక సహాయం పెంచి పేద కుటుంబాలకు మేలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల లబ్ధిదారులు సకాలంలో సహాయం పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాలను నిర్వీర్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ టీఎస్టీఎస్ చైర్మన్ రాకేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భర్తను రోకలి బండతో కొట్టి చంపిన భార్య



హుస్నాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో భార్య రాజమణి రోకలి బండతో దాడి చేయడంతో భర్త కోటి వెంకటేశ్వర్లు (62) మృతి చెందాడు. భార్య రాజమణి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్ఎం ఉద్యోగం చేస్తుండగా, వెంకటేశ్వర్లు ఆసిఫాబాద్ జిల్లాలో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెలాఖరులో ఆయన రిటైర్మెంట్‌కు సిద్ధమవుతుండగా, ఆస్తి పంపకాల విషయంలో ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. గొడవలో రాజమణి రోకలి బండతో వెంకటేశ్వర్ల తలపై దాడి చేయగా తీవ్ర గాయాలపాలై ఆసుపత్రికి తరలించే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

## భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి ప్రత్యేక పూజలు



కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నాగుల పంచమి సందర్భంగా ఉప్పల సత్తవ్వ భూమయ్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గిద్దె పెరుమాళ్ళ దేవాలయం ప్రాంగణంలోని పాముల పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈసారి కూడా ట్రస్ట్ సభ్యులు 17 మంది పేరుతో స్వచ్ఛమైన వెండితో తయారు చేసిన 17 నాగపడగలు, రెండు కళ్ళు, ఒక పుట్ట ప్రతిమను పుట్టలో వేశారు. 17 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు గణేశ్‌నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయంలో ప్రతిష్ఠించిన నాగదేవత విగ్రహానికి శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి మందలేముల అనిల్ శర్మ వేదమంత్రాలతో పూజలు చేశారు. గిద్దె పెరుమాళ్ళ దేవాలయంలో వందలాది భక్తులకు సిరా ప్రసాదం సిద్దుల లింగయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఉప్పల అనసూయ, జ్యోతి, నందిత, రామేశం, నవీన్ పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను సహించం

### - ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి

కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానం దళితుల ఆత్మగౌరవంపై దాడిగా భావించాలని, వివక్షకు వ్యతిరేకంగా సంఘటితం కావాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కరీంనగర్ కోర్టు సర్కిల్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ నుంచి ఖర్గే వరకు దళిత నాయకులను అవమానించే ధోరణి కొనసాగుతోందని విమర్శించారు.




ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు అంజన్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ, ఖర్గే అవమానం అంటరానితన భావజాలాన్ని బయటపెట్టిందని, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పురుమల్ల శ్రీనివాస్, తాజుద్దీన్, శ్రావణ్ నాయక్, రామ్ రెడ్డి, స్వామి గౌడ్, వెన్న రాజు, మల్లయ్య, సిరాజ్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, ముస్తాక్ అహ్మద్, మాతంగి అనిల్, విద్యాసాగర్, కోటి, జీడి రమేష్, శ్రీనివాస్, మంజుల, కవిత, మమత, అజయ్, పరుశు రాములు, లక్ష్మణ్, రాహుల్, శ్రీనివాస్, కీర్తి కుమార్, తిరుపతి, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్‌గా కోలా రమేష్ ప్రమాణ స్వీకారం



రామడుగు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రామడుగు మండలం గోపాలరావుపేటలో కోలా రమేష్ సింగిల్ విండో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం హాజరై రమేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో సహకార సంఘాలు రైతులకు కీలకమని, విత్తనాలు, ఎరువులు, రుణాలు వంటి సేవలు సకాలంలో అందేలా పాలకవర్గాలు కృషి చేయాలని సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు అందించవచ్చని పేర్కొన్నారు. నూతన చైర్మన్ కోలా రమేష్ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, రైతుల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పారదర్శకత, జవాబుదారీతనం తో సహకార సంఘాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో సింగిల్ విండో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో సింగిల్ విండో సహకార సంఘాల పాత్ర మరింత కీలకమవుతుందని నాయకులు పేర్కొన్నారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా రమేష్ ముందుకు సాగాలని వారు అభిలషించారు.

## కేజీబీవీలో బాలికల అస్వస్థతపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





సిద్దిపేట, ఆగస్టు 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇటీవల పలువురు బాలికలు అస్వస్థతకు గురైన నేపథ్యంలో విద్యాలయంలోని పరిస్థితులను ఆమె పరిశీలించి అధికారులను ప్రశ్నించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, మురుగునీరు బయటకు వెళ్లేందుకు సరైన వసతి లేకపోవడం, సెప్టిక్ ట్యాంక్ నిండిపోవడం వంటి సమస్యలు విద్యార్థుల అస్వస్థతకు కారణమని అధికారులు వివరించారు. వైద్య శిబిరం నిర్వహించి నమూనాలు సేకరిస్తున్నామని, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ చేయించామని, విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసి మురుగునీరు సులభంగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలని, సెప్టిక్ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉంటున్న బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఉపాధ్యాయులు, వంట సిబ్బందిని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఇంచార్జీ డీఈఓ రమేష్, సెక్టోరియల్ అధికారి రామస్వామి, కేజీబీవీ నోడల్ అధికారి, తహసీల్దార్, పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం - ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహించడం వల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిబంధనల మేరకు త్వరగా పరిష్కరించాలని సూచించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఒంటరి మహిళ




ఇజ్జగిరి లింగవ్వ పెన్షన్ కోసం పెట్టుకున్న అర్జీని పరిశీలించి, అక్కడికక్కడే పెన్షన్ మంజూరు పత్రాన్ని అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్. రాజీవ్ మల్హోత్ర, తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేందర్, వైద్యాధికారి డాక్టర్ పుల్లారావు, ట్రాన్స్‌కో ఏఈ ఖాసీం, సీఐ బొల్లం రమేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, స్థానిక సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రజలకు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## టీఎన్జీవోల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు

కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : హైదరాబాద్ నాంపల్లి టీఎన్జీవోల కేంద్ర సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ముజీబ్ హుస్సేన్ నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఉద్యోగుల పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ వంటి సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని, పెన్షన్ విధానంలో జరుగుతున్న అన్యాయాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో లోపాలను సవరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని



కోరారు. అదేవిధంగా పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, ఉద్యోగుల బిల్లులు, రిటైర్మెంట్ ప్రయోజనాలను ఆలస్యం లేకుండా చెల్లించాలని తీర్మానం చేశారు. సమావేశంలో టీఎన్జీవోల జెండా, కండువా ఆవిష్కరణను ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా సభ్యుల నుంచి సేకరించిన రూ.2,82,000 విలువైన చెక్కును కేంద్ర సంఘ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, సర్దార్ అరవింద్ సింగ్, రాగి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు బొంకూరు శంకర్, సందీప్ రెడ్డి, మిర్యాల నాగేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, ప్రవీణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 225 దరఖాస్తులు అందగా, వీటిలో కరీంనగర్ నగరపాలకకు 58, గృహనిర్మాణ శాఖకు 56 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం క్యాంపు కార్యాలయం, చీఫ్ సెక్రటరీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, 30 రోజులు దాటిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు లాగిన్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. పింఛన్ల దరఖాస్తు సమయంలో ప్రజలకు



ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులు ఎవరు మిస్ కాకుండా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. యూనిఫామ్ పంపిణీలో ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. డీఆర్డీఓ గీత, మెప్మా పీడీ స్వరూప రాణి మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్ మినహా అన్ని పింఛన్ల దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. కొత్త పింఛన్ల దరఖాస్తులకు ఫుడ్ సెక్యూరిటీ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నామని, గత నిబంధనలనే కొనసాగిస్తున్నామని వివరించారు. ప్రతి గ్రామపంచాయతీ, మండల కేంద్రం, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో గ్రామసభలు, వార్డుసభలు, ప్రజాపాలన వారోత్సవాల్లో దరఖాస్తు చేసిన వారు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, పత్రాలు సమర్పించని వారు ఇప్పుడు ప్రభుత్వం సూచించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీరు త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, వరి సాగుకు తగినంత నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. వరి పంటకు అవసరమైన నీటితో 3--4 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని, వరి సాగు చేస్తే దిగుబడి తగ్గి, ధాన్యం నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మొక్కజొన్న, కంది,



పెసలు, మినుములు, అలసందులు వంటి తక్కువ నీటితో సాగు చేసే పంటలను రైతులు ఎంచుకోవాలని సూచించారు. ఈ పంటలకు కనీస మద్దతు ధర లభిస్తుందని, మొక్కజొన్నకు మార్కెట్‌లో ఎక్కువ ధర కూడా వస్తోందని తెలిపారు. రైతులు నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసి, వ్యవసాయ శాఖ, సాగునీటి శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించడంలో మీడియా సంస్థలు కూడా భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్.ఈ. విష్ణు ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో పాటు సంబంధిత అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థుల ర్యాలీ



**హుస్నాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జి.ఓ నం.97 రద్దు చేసి ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు హుస్నాబాద్‌లో భారీ ర్యాలీ, రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రతిపాదనలు పాలిటెక్నిక్ విద్యను దెబ్బతీసే అవకాశం ఉందని, ప్రస్తుత వ్యవస్థను బలోపేతం చేసి మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక కోర్సులు, పరిశ్రమల అనుసంధానం, ప్లేస్‌మెంట్లు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థల్లో విలీనం చేయడం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జి.ఓ నం.97 రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాహుల్, నగర కార్యదర్శి రాజు, నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, మేఘన, రవళి, సంధ్యతో పాటు వందలాది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆవోపా ఆధ్వర్యంలో మెరిట్ అవార్డుల ప్రధానం



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆర్యవైశ్య అధికారుల మరియు వృత్తి నిపుణుల సంఘం (ఆవోపా) ఆధ్వర్యంలో ఎం.ఆర్. వైశ్య భవన్‌లో మెరిట్ అవార్డ్స్--2026 ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు నలుమాసు సుదర్శనం సారథ్యంలో జరిగిన ఈ వేడుకలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఈఏపీసెట్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి, రజత పతకాలు, మెమెంటోలు, అభినందన పత్రాలు అందజేశారు. ఎస్ఎస్సీ విభాగంలో గట్టు సంప్రీతి (గోల్డ్), అన్నకుల శ్రీ సాన్వి (సిల్వర్), రేపాక లక్ష్మీ శరణ్య (బ్రాంజ్) విజేతలయ్యారు. సీబీఎస్సీ 10వ తరగతిలో కన్నా ఓంకార్తికేయ (గోల్డ్), కమటాల సాయి సాత్విక్ (సిల్వర్), కొండూరి విక్రాంత్ (బ్రాంజ్) మెడల్స్ సాధించారు. ఇంటర్ ఎంపీసీలో కొండ లాస్య శ్రీ (గోల్డ్), యాద రిష్విత (సిల్వర్), ఎస్. అపూర్వ (బ్రాంజ్) ప్రతిభ కనబరిచారు. ఇంటర్ బైపీసీలో శ్రీ సంహిత మంచాల (గోల్డ్), మంచాల శివబాలాజీ (సిల్వర్) విజేతలయ్యారు. ఈఏపీసెట్లో తోట సాయి విఘ్నేష్ (గోల్డ్), పల్లెర్ల రోహిత్ (సిల్వర్), బోల్సాని హాసిని (బ్రాంజ్) మెడల్స్ అందుకున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్లో బొల్లం అక్షత్ (గోల్డ్), అనంతుల అక్షయ (సిల్వర్) ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్స్లో శ్రీచరణ్ ఎరుకుల్ల (గోల్డ్), బొల్లం అక్షత్ (సిల్వర్), పాలకుర్తి రిషిత్ (బ్రాంజ్) విజేతలయ్యారు.
నీట్లో పాల్తేపు శశ్మిత్ గోల్డ్ మెడల్ సాధించారు. ముఖ్య అతిథులు గంజి స్వరాజ్ బాబు, తోట లక్ష్మణరావు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇటువంటి అవార్డులు వారి జీవితానికి దిక్సూచిలా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా ఆవోపా నాయకులు సామ నారాయణ, వల్లాల సత్యనారాయణ, కట్కూరి చంద్రశేఖర్, కమటాల రామ్మోహన్, పాత గంగాధర్, జిల్లా కృష్ణమూర్తి, అక్కినపెల్లి శివజ్యోతి, అక్కినపెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. దాతలు యాద కిషన్, పాత శేఖర్, తోడుపునూరి రామ్ మనోహర్, నలుమాసు ఆనందం, రాచర్ల వసంతం, పాత వెంకట నరసయ్య తదితరులు సహకరించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# పేదల సంక్షేమ పథకాలపై ఆంక్షలు వద్దు సతీష్‌కుమార్

**హుస్నాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఆంక్షలు విధించకూడదని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం పేదల కన్నీళ్లు తుడిచేలా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి రూ.51 వేల నుంచి రూ.1,00,116 వరకు ఆర్థిక సాయం అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఇప్పుడు పేదల సంక్షేమ పథకాలపైనా ఆంక్షలు విధించే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. పథకాలను నిర్వీర్యం చేస్తే బీఆర్ఎస్ పోరాటం మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తలకిందులుగా జాతీయ జెండా ఆవిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ఫిర్యాదు

**దేవరకొండ, ఆగస్టు 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ జెండాను తలకిందులుగా ఆవిష్కరించిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో పద్మప్రియ కి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ..జాతీయ జెండా ఆవిష్కరణలో చోటుచేసుకున్న ఈ ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని




కోరారు. అదేవిధంగా జాతీయ జెండాకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా పాటించేలా విద్యాసంస్థలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని వారు కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రామావత్ రాజేష్, నేతళ్ల జయరాం, పరమేష్, సుధాకర్, ప్రణయ్ కార్తీక్, మనోహర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు చిన్నారుల జీవితాల్లో కొత్త వెలుగులు



**సిద్దిపేట, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట శిశు గృహంలోని నలుగురు చిన్నారులను కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన దంపతులకు అధికారికంగా దత్తత ఇచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె. హైమావతి చేతుల మీదుగా దత్తత ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను బాగా చదివించి, వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల భవిష్యత్తు నిర్మాణం పూర్తిగా తల్లిదండ్రుల బాధ్యతేనని పేర్కొన్నారు. పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేట శిశు గృహం లేదా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారిక విధానంలో దత్తత తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సీహెచ్. శారద, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె. రాము, శిశు గృహ మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. టౌన్ అధ్యక్షుడు కేతా సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయుడు రామ్‌జీ సర్కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులతో మాట్లాడిన నాయకులు మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, వాష్‌రూమ్‌ల నిర్వహణ, తరగతి గదుల పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, బెంచీలు, విద్యా సామగ్రి వంటి అంశాలపై సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం నాణ్యతపై




ఎలాంటి రాజీ లేకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతకు వాష్‌రూమ్‌లు అత్యంత కీలకమని, వాటిని శుభ్రంగా ఉంచి నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. పాఠశాలలో సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన తరగతి గదులు, సరైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామ్‌జీ సర్ విద్యార్థుల సమస్యలను సానుకూలంగా విని, త్వరితగతిన పరిష్కరించే ందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గణేష్, ఆకాష్, జగన్, ఉదయ్, జ్ఞానేశ్వర్, మధు, శరత్, యోగి, శ్రీవర్ధన్, భాను, పరమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాలి టెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా



కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో తీసుకువచ్చిన "శక్తి" పాలసీ ద్వారా డిప్లమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేయడం సరికాదని అన్నారు. విద్యారంగాన్ని ఎస్బీటీఈటి పరిధి నుంచి తొలగించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. డిప్లమా పూర్తయిన తర్వాత ఈసెట్ ద్వారా విద్యార్థులు నేరుగా బి.టెక్ రెండవ సంవత్సరం ప్రవేశించే అవకాశం ఉందని, కానీ జీవో 97లో దీనిపై స్పష్టత లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి దాని స్థాయిని తగ్గించే నిర్ణయాలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డిప్లమా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినయ్ సాగర్, కమిటీ సభ్యులు రాకేష్, సన్నీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల తొలగింపుపై సిపిఎం ఆగ్రహం

**నల్లగొండ, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 2023లో లాటరీ ద్వారా ఎంపికైన 431 మంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులలో సుమారు 60 మందిని తొలగించడానికి కారణాలు అడిగితే అరెస్టులు చేయడమే ప్రజా పాలనా? అని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. జిల్లా కమిటీ సభ్యుడు ఎండి సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పోరాట సాధన కమిటీ కన్వీనర్ అవుట్ రవీందర్ మాట్లాడుతూ, "అర్హుల జాబితాలో ఉన్నవారిని తొలగించడానికి గల కారణాలు చెప్పలేక పోలీసులతో అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15న ఇండ్ల పంపిణీ సందర్భంగా పేర్లు తొలగించబడిన లబ్ధిదారులు తహసిల్దార్ కార్యాలయానికి రమ్మని చెప్పడంతో, వారు అక్కడికి చేరుకున్నారు. తహసిల్దార్



రాకపోవడంతో సిపిఎం నాయకులు, లబ్ధిదారులు కార్యాలయంలో బైటాయించారు. అనంతరం పోలీసులు వచ్చి నాయకులను అరెస్టు చేయగా, లబ్ధిదారులు అడ్డగించారు .నాయకులు మాట్లాడుతూ, "552 ఇండ్లలో లాటరీ ద్వారా ఎంపికైన 421 మంది అర్హులని అధికారులే ప్రకటించారు. కానీ పంపిణీ సమయంలో 60 మందిని తొలగించడం దుర్మార్గం. ఇది తహసిల్దార్ కార్యాలయమా? లేక కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా?" అని ప్రశ్నించారు. తొలగించిన లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని, పట్టణంలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు అందే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు గంజి రాజేష్, పగిల్ల జయమ్మ, మధుసూదన్, రాధ, రహీమున్నీస బేగం, కాపర్తి ధనమ్మ, పసుపుల సంధ్య, పుట్ట బత్తుల పావని, నల్లబోతు కవిత, గుంటి నాగలక్ష్మి, మేకల కల్పన తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ రూరల్ మండలంలో పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై చర్యలు చేపట్టారు. చేగుర్తి గ్రామానికి చెందిన మిరియాల నరేష్, బెజ్జంకి సంతోష్, చామనపల్లి నాగరాజు అనుమతులు లేకుండా మానేరువాగు నుండి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తుండగా బొమ్మకల్ లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెక్ట్ షీట్లు తెరవనున్నామని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# సేవా రత్న పురస్కారంతో వసంత లక్ష్మికి ఘన సత్కారం



**హైదరాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వర మాధురి సాహితీ సాంస్కృతిక సంస్థ 10వ వార్షికోత్సవం, 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభ మెయిన్ హాల్‌లో నిర్వహించిన "స్వర



నృత్య వేడుక" ఘనంగా జరిగింది. సంగీత కళారత్నం, గాన ముగ్ధిక, ప్రముఖ గాయనీమణి సాయి పావని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ఈ వేడుకను సమన్వయం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా పలువురికి సేవా రత్న పురస్కారాలు అందజేశారు. శ్రీ సాయి కృప మ్యూజిక్, డాన్స్ అండ్ హాబీ స్కూల్ డైరెక్టర్, వోకల్ ఆర్టిస్ట్ వసంత లక్ష్మికి సేవా రత్న పురస్కారం అందజేయడం విశేషం. కళారంగంలో ఆమె అందిస్తున్న సేవలను నిర్వాహకులు అభినందించారు. అనంతరం శ్రీ సాయి కృప మ్యూజిక్, డాన్స్ అండ్ హాబీ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
మంగళవారం, ఆగస్టు 18, 2026



# ఎలగందుల ఖిల్లాలో వృక్షశాస్త్ర విద్యార్థుల జీవవైవిధ్య పరిశీలన



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఎలగందుల ఖిల్లాలో ఒకరోజు క్షేత్ర పర్యటన నిర్వహించారు. డాక్టర్ పడాల తిరుపతి నేతృత్వంలో తృతీయ సంవత్సరం విద్యార్థులు, డిగ్రీ విద్యార్థులు ఖిల్లా పరిసరాల్లోని వివిధ మొక్కల జాతులు, సూక్ష్మజీవులు, జంతువుల జీవవైవిధ్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు చేశారు. జీవవైవిధ్య ప్రాధాన్యత, రకాలు, అవసరం, నష్టానికి గల కారణాలను అధ్యయనం చేశారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రాంతాల్లో మొ క్కలను పరిశీలించి నమోదు చేసి సంరక్షించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ విద్యార్థులకు ప్రతి సంవత్సరం క్షేత్ర పర్యటనలు చేసి ప్రకృతి, పంటలు, అడవులు, జీవజాతులను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రౌతు రాధాకృష్ణ, డాక్టర్ మహమ్మద్ తాహీర్ హుస్సేన్, శ్రీమతి కందుకూరి కళాజ్యోతి, శ్రీమతి ఆసంపల్లి స్వరూప రాణి, మహమ్మద్ తాజుద్దీన్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ప్రకృతిని దగ్గరగా అనుభవించే ఈ క్షేత్ర పర్యటనను విజయవంతంగా నిర్వహించిన వృక్షశాస్త్ర విభాగాన్ని కళాశాల ప్రిన్సిపల్, విభాగాధిపతి అభినందించారు.

# క్యాన్సర్ పేషెంట్‌కు 53వ సారి రక్తకణాల దానం



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సుల్తానాబాద్ పూసల గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలికి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తకణాలు అవసరమైన నేపథ్యంలో బొమ్మకల్ డివిజన్‌కు చెందిన పాశం కిషన్ సమాచారం అందించగా, చిరంజీవి అభిమాని వరికిల్ల దినేష్ వెంటనే స్పందించి చల్మెడ ఆనందరావు హాస్పిటల్‌లో 53వ సారి ప్లేట్లెట్స్ దానం చేశారు. పేషెంట్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన దినేష్‌కు ఆసుపత్రి యాజమాన్యం, బంధు వులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం అనంతరం దినేష్ మాట్లాడుతూ, 18 నుంచి 65 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి యువకుడు రక్తదానం చేయవచ్చుని, ఇది ఇత రుల ప్రాణాలను కాపాడటమే కాకుండా మన ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని పేర్కొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగించాలని బీఆర్ఎస్ డిమాండ్




**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ యూత్ నాయకుడు, వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ నేతృత్వంలో జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం పేద కుటు ంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిం దని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని దృ ష్టిలో ఉంచుకుని ఎలాంటి ఆటంకాలు లేకుండా పథకాలను కొనసాగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచిన గ్రామపంచాయితీ



**గంగాధర, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన పారిశుద్ధ కార్మికుడు మాంకాళి మల్లయ్యకు గ్రామపం చాయితీ పాలకవర్గం రూ.26 వేల ఆర్థిక సహాయం అందజేసింది. చెర్లపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య శనివారం ప్రమాదానికి గురై కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్పంచ్ ఎట్టేపు కనుకయ్య ఆసుపత్రిలో పరామర్శించి రూ.10 వేల సహాయం అందించగా, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి కలిసి మరో రూ.16 వేల సహాయం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. సహాయం అందించిన వారిలో ఉప సర్పంచ్ నేరళ్ళ అయిలయ్య, వార్డు సభ్యులు వేల్పుల రాములు, అమిరిశెట్టి పద్మ, దొనుకుంటి లావణ్య, అమిరిశెట్టి లత, జవ్వాజి సంతోష్, గుడిసె తిరుపతి, కార్యదర్శి శేఖర్, తూడి తిరుపతి, బూరుగు రమేష్ తదితరులు ఉన్నారు.

# దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు ఒకరోజు శిక్షణ



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పీఎం శ్రీ కార్యక్రమాల భాగంగా కరీంనగర్ ముకరంపురాలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కరీంనగర్ భవిత కేంద్రంలో 10 మండలాలకు, హుజురాబాద్ భవిత కేంద్రంలో 6 మండలాలకు చెందిన తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు అందుతున్న సదు పాయాలు, దివ్యాంగుల రకాలు, విద్యాహక్కు చట్టం, దివ్యాంగ చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగ బాలల రక్షణ చర్యలు, వారికి అందించే ఉపకరణాలు, హక్కు లు, ఎంటైటిల్మెంట్స్ గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి భద్రయ్య, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ పి. శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు లకం బాబు, వెంకటేశ్వరరావు, మంజుల, రాంప్రసాద్, జ్యోతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనకు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీసులు



**సుల్తానాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఈ నెల 19న జరగనున్న మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూని యర్ కళాశాలలో నిర్వహించనున్న సభా ప్రాంగణం, ప్రవేశ మార్గాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలను టీసీపీ రామ్‌రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ పరిశీలించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సభకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజిత్ కుమార్, ఎస్సై చంద్రకుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జ్యువెలర్స్ దోపిడీ కేసులో ఐదుగురిపై పీడీ యాక్ట్




**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ పట్టణంలోని పీ.యం.జే. జ్యువెలర్స్‌లో జరిగిన సంచలన బందిపోటు కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురిపై పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. 2026 మే 3న జరిగిన ఈ ఘటనలో నింది తులు తుపాకులతో కాల్పులు జరిపి రూ.82 లక్షల విలువైన బంగారం దోచుకెళ్లారు. ఇప్పటివరకు ఎనిమిది మంది అరెస్టు కాగా, వారిలో ప్రధాన నిందితులైన రఘునాథ్ కర్మాకర్, రావిష్ కుమార్, సూర్యమణి కుమా ర్, యాదవ్ జైనుల్ అబ్దిన్, మొహమ్మద్ ఆదిల్ ఖాన్‌లపై పీడీ యాక్ట్ అమలు చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను నిందితులకు జిల్లా జైలులో అందజేసి అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ చర్యలో కీలక పాత్ర పోషించిన ఏసీపీ ఎన్. వెంకటస్వామి, సీఐ కె. సృజన్ రెడ్డిలను కమిషనర్ అభినంది ంచారు. నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# ట్రినిటీ కళాశాలకు గర్వకారణం.. అధ్యాపకురాలికి డాక్టరేట్



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బొమ్మకల్ ట్రినిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా 17 సంవత్సరాలుగా సేవలందిస్తున్న దోర్నాల రజితకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆచార్య కె. రాజిరెడ్డి పర్యవేక్షణలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమ రిస్క్--రిటర్న్ విశ్లేషణ అంశంపై ఆమె సమగ్ర పరిశోధన పూర్తి చేశారు. సన్ ఫార్మా, డా. రెడ్డీస్ లాబొరేటరీస్, సిప్లా వంటి ప్రముఖ కంపెనీల ఆర్థిక పనితీరు, పెట్టుబడుల రిస్క్--రిటర్న్ పరిస్థితులను విశ్లేషించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని ట్రినిటీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది ఆమెను అభినందించారు. కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. నాగేంద్ర సింగ్, వైస్ ప్రిన్సిపాల్ పి. కిషోర్, అకాడమిక్ డైరెక్టర్ బి. రాజగోపాల్, ఏఓ డి. రాజశేఖర్ రెడ్డి, ఎంబీఏ హెచ్‌ఓడీ డా. సిహెచ్. ప్రవీణ్ కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ, బోధనతో పాటు పరిశోధన రంగంలోనూ అధ్యాపకులు రాణించడం గర్వకారణమని, ఉన్నత విద్యా ప్రమాణాలు, పరిశోధనా సంస్కృతిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగంపై కఠిన చర్యలు కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ ధాన్యం సీఎంఆర్ బకాయిల విషయంలో రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లాలో 38 మంది మిల్లర్ల వద్ద రూ.238 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, ఇప్పటివరకు 7 క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఒకరిపై పీడీ యాక్ట్ అమలు చేశామని వెల్లడించారు. మరో 31 మిల్లుల్లో పంచనామా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌పై ఆగస్టు 6న నిర్వహించిన తనిఖీలో 7,493 మెట్రిక్ టన్నుల ధాన్యం డిఫాల్ట్‌గా ఉన్నట్లు గుర్తించామని, రూ.24. 18 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని లెక్కల్లో చూపకపోవడం, సీఎంఆర్ అందించకపోవడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని, బకాయిలను వసూలు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు, రెవెన్యూ రికవరీ చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ ధాన్యం ప్రజాధనం ద్వారా కొనుగోలు చేసిన ఆస్తి అని, మిల్లర్లు నిబంధనల ప్రకారం సీఎం ఆం ్ను ఎఫ్‌సీఐ/ టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అం దించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతమైన శస్త్రచికిత్సలు





**పెద్దపల్లి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా ఆసుపత్రిలో రెండు కీలక శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. థ్రాంబోసైటోపీనియాతో బాధపడుతున్న 23 ఏళ్ల గర్భిణికి ప్లేట్లెట్లు ఎక్కించి సురక్షితంగా ప్రసవం జరిపారు. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి అధికారులు తెలిపారు. అధిక ప్రమాద గర్భధారణ అయినప్పటికీ సమయానుకూల పర్యవేక్షణ, చికిత్సతో విజయవంతంగా ప్రసవం జరగగలిగామని పేర్కొన్నారు. అదే రోజు 37 ఏళ్ల మహిళకు తీవ్రమైన ఆస్టియోఆర్థ్రైటిస్ కారణంగా హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ రెండు శస్త్రచికిత్సల్లో డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్ కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ రవళిక, అనెస్తేషియా నిపుణురాలు డాక్టర్ స్వాతి పాల్గొన్నారు. వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ అభినంది ంచారు. ప్రజలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నవజాత శిశు కేంద్రం, 2డి ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## పీఎంఐ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత

**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** 11 కెవి గోధమగడ్డ ఫీడర్‌పై పీఎంఐ మరమ్మతు పనుల కారణంగా ఈ రోజు ఉదయం 9.00 గంటల నుండి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రభావిత ప్రాంతాలు: తాహెరా మసీదు, శ్రీనగర్ కాలనీ, అంజనాద్రి దేవాలయం, ధోబీఘాట్, గోదాం గడ్డ, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, జెడ్పి క్వార్టర్స్, భగత్‌నగర్ భాగం, మల్లమ్మ మార్కెట్, కొమ్ము రాజు, గోదాం బ్యాక్‌సైడ్, రఘుపతి రెడ్డి హాస్పిటల్ పరిసరాలు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏడీఈ ఎం. లావణ్య కోరారు.

# వందేమాతరంపై కాంగ్రెస్ నేతల వైఖరిని ఖండిస్తూ బీజేవైఎం ఆందోళన



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ గేయం వందేమాతరం ఆలాపన సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రదర్శించిన వైఖరిని ఖండిస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తాలో భారీ నిరసన జరిగింది. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్ మాట్లాడుతూ, ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శించారు. జాతీయ గేయానికి గౌరవం చూపకపోవడం దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిందని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు, మునిగంటి కుమార్, ఎడవెల్లి శశిధర్ రెడ్డి, నక్క ప్రమోద్, గుర్రం వెంకటేశ్ గౌడ్, ఆకుల మనోహర్, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ నాయక్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన మేయర్



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 60వ డివిజన్‌లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత విషయంలో రాజీ ఉండదని హెచ్చరించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే రోజు 3వ డివిజన్ విద్యారణ్యపురిలో డ్రైనేజీ పనులకు, 23వ డివిజన్ బాలా జీనగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ప్రతి డివిజన్‌లో సమస్య లను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కార్పొరేటర్లు సాదినేని లావణ్య మునిందర్, గుమ్మడి రాజ్ కుమార్, వరాల నర్సింగం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# నాగుల పంచమి పర్వదినాన భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు




**సుల్తానాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నాగుల పంచమి, తొలి శ్రావణ సోమవారం సందర్భంగా పట్టణం, మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని నాగదేవతలకు పాలు, పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు పుట్టల వద్ద పాలు పోసి పూజలు నిర్వహించారు. అర్చకులు వల్లం కొండ మహేష్ ఆధ్వర్యంలో నాగదేవతలకు అభిషేకాలు, అర్చనలు జరిగాయి. తొలి శ్రావణ సోమవారం కావడంతో శివాలయాల్లో కూడా భక్తుల రద్దీ పెరిగింది. శివుడికి అభిషేకాలు చేసి బిల్వపత్రాలు సమర్పించారు. ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించి సుఖసంతోషాలు కోరుకున్నారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు గ్రామంలో గడప గడపకు పాలకవర్గం



**గన్నేరువరం, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం గడప గడపకు పాలకవర్గం కార్యక్రమాన్ని చేపట్టింది. సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ అధ్యక్షతన ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాలకవర్గం కలిసి 3, 4, 5, 6వ వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు, దరఖాస్తులను స్వీకరించారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, నీటి, విద్యుత్ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సర్పంచ్ మాట్లాడుతూ రేపు కూడా గ్రామంలోని మూడవ, నాలుగో వార్డులను సందర్శించి ప్రజల దరఖాస్తులను స్వయంగా స్వీకరిస్తామని తెలిపారు. పెన్షన్ దరఖాస్తులు చేసుకునే వారు అవసరమైన పత్రాలతో ఇంటి వద్ద ఉండాలని, పాలకవర్గం స్వయంగా వచ్చి దరఖాస్తులు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ న్యాలపట్ల రమేష్, వార్డు సభ్యులు చోక్కల శ్రీనివాస్, చోక్కల లక్ష్మణ్, హనుమండ్ల యాదగిరి, నేలపట్ల పరశురాం, కరోబార్ ముల్కల అంజయ్య, సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



**సుల్తానాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలపై దృష్టి సారించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం ఆయన సుల్తానాబాద్‌లోని ఎం.జె.పి.టి.బి.స.డబ్ల్యూ.ఆర్.ఐ.ఈ.ఎస్ బాలికల డిగ్రీ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన లిచాంబర్ ఆఫ్ డ్రీమ్స్‌లినను ప్రారంభించారు. అనంతరం డార్మిటరీ, వంటగది, తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వారి లక్ష్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల ఆసక్తులకు అనుగుణంగా కెరీర్ గైడెన్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్య, పీజీ కోర్సులు, ఉద్యోగ అవకాశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్), వి-హబ్ ద్వారా అందుబాటులో ఉన్న కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మణిదీప్తి, కళాశాల ప్రిన్సిపాల్ వనజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రూ.24.18 కోట్ల ధాన్యం పక్కదారి



**సుల్తానాబాద్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని దారి మళ్లించిన కేసులో ఇద్దరు రైస్ మిల్లు భాగస్వాములను పోలీసులు అరెస్ట్ చేశారు.సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మి ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు 2023--24లో 10,015 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, అందులో 6,662 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా కేవలం 1,577 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించారు. మిగిలిన 5,020 మెట్రిక్ టన్నుల బియ్యం, రూ.24.18 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు.పౌర సరఫరాల శాఖ ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, మేనేజింగ్ పార్టనర్ రేణికుంట మధు, పార్టనర్ రేణికుంట రవీందర్ రెడ్డిని అరెస్ట్ చేశారు.నిందితులపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, తెలంగాణ రైస్ కస్టమ్ మిల్లింగ్ ఆర్డర్‌తో పాటు బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పెద్దపల్లి డీసీపీ భూక్యారాం రెడ్డి తెలిపారు.

# ఇండియన్ పోలీస్ మెడల్‌తో నిరంజన్ రెడ్డికి ఘన సత్కారం



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నక్సల్స్ కార్యకలాపాలు, అసాంఘిక చర్యల నియంత్రణలో విశేష కృషి చేసిన కరీంనగర్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డి ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న నేపథ్యంలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.ఆగస్టు 15న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మెడల్ అందుకున్న ఆయనను పలువురు అభినందించారు. సోమవారం సీపీ గౌష్ ఆలంను కలిసిన నిరంజన్ రెడ్డిని ఆయన ప్రశంసిస్తూ, విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోవడం కమిషనరేట్‌కు గర్వకారణమని పేర్కొన్నారు.ప్రజలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది నిరంజన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఐపీఎం అందుకున్న తర్వాత స్టేషన్‌కు చేరుకున్న ఆయ నకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అరుదైన మెడల్ అందుకోవడం ఆనందంగా ఉందని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పోలీస్ సిబ్బంది అభిప్రాయపడ్డారు.

# రైతు పరిరక్షణ సమితి కార్యదర్శిగా మీసా రాజయ్య నియామకం



**గంగాధర, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం వెలిశాల గ్రామానికి చెందిన మీసా రాజయ్యను ఉమ్మడి జిల్లా జాతీయ రైతు పరిరక్షణ సమితి కార్యదర్శిగా నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డి కరుణాకర్ రెడ్డి ప్రకటించారు.రైతుల సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతం కోసం ఆయన కృషి చేస్తారని నాయకులు తెలిపారు.

# ఏడాది పాపను దత్తత తీసుకున్న తమిళనాడు దంపతులు



**కరీంనగర్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ శిశుగృహలోని సంవత్సరం పాపను తమిళనాడు దంపతులకు జిల్లా సంక్షేమ అధికారి యం. సరస్వతి దత్తత అందించారు.ఈ సందర్భంగా పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన విధానంలోనే దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. పూర్తి సమాచారం కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, జిల్లా పరిషత్‌ను సంప్రదించాలని తెలిపారు.కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు కళింగ శేఖర్, బి. రాధ, డిసిపిఓ పర్వీన్, శిశుగృహ ఇంచార్జి అపూర్వ, జె. తిరుపతి, మునిగంటి రాజ్‌కుమార్, సాదినేని రమేష్, అనూష, స్వప్న, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజాపూర్ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**రామగిరి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాజాపూర్ గ్రామానికి చెందిన సింగరేణి భూనిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు .భూముల రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న ఇళ్లను వెంటనే చేర్చాలని, పునరావాసం, ఉద్యోగాలు, ఇళ్ల స్థలాలు మరియు ఇతర హామీలను కాలపరిమితిలోగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్వాసితుల సంక్షేమాన్ని విస్మరించడం అన్యాయమని పేర్కొన్నారు.సింగరేణి యాజమాన్యం స్పందించకపోతే సమస్యలను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేపడతామని హెచ్చ రించారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండే లక్ష్మీనారాయణ, పట్టణ అధ్య క్షుడు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, మూగ మల్లేష్, బొడ్డు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్, వివిధ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయ్‌నగర్‌కు చెందిన నర్సమ్మకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని పీడీ హౌసింగ్ అధికారికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కొదురుపాక గ్రామానికి చెందిన కోంద్ర అశోక్ భార్యకు అవుట్సోర్సింగ్ ఉద్యోగం కల్పించేందుకు వారధి సోసైటీకి రాసి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాపులపల్లి గ్రామానికి చెందిన శంకర్ వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని గ్రామీణ అభివృద్ధి అధికారికి ఆదేశించారు. కాచాపూర్ గ్రామానికి చెందిన కొమురయ్య భూమి సమస్యను తహసిల్దార్ పరిశీలించి సరిచేయాలని సూచించారు.ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళలకు శక్తి యాప్ అవగాహన కార్యక్రమం నిర్వహణ




**నందికొట్కూరు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచనలతో శక్తి టీం సిబ్బంది పాలమర్రి గ్రామంలో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.ఏఎస్ఐ ఖాదర్ బాషా, పీసీ రసూల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 35 మంది మహిళలకు శక్తి యాప్, వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర నంబర్లు 112,100 వినియోగంపై వివరించారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని, 18 ఏళ్లు దాటిన తర్వాతే బాలికలకు పెళ్లిళ్లు జరపాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనపడినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సైబర్ క్రైమ్ జరిగితే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.అదనంగా డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి పరిరక్షణకు ప్రజావాణి వినతి



**మర్రిగూడ ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు లపంగి నరసింహ ప్రభుత్వ భూమి పరిరక్షణపై వినతి పత్రం సమర్పించారు.రాంరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 698లో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకు వినియోగించాలంటూ ఆయన తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్యకు దరఖాస్తు అందజేశారు. ఆ భూమిలో కొంత భాగాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, కార్యాలయాలు, ప్రజా అవసరాల కోసం స్థలం అత్యవసరమని, అందుకే అధికారులు హద్దులు నిర్ధారించి ఆక్రమణలను తొలగించి ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



**ఎలిగేడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ఎలిగేడు, సుల్తాన్‌పూర్, నర్సాపూర్, శివపల్లి గ్రామాల్లోని వరి పొలాలను సోమవారం వ్యవసాయ పరిశోధనా స్థానం కూనారం శాస్త్రవేత్తలు డాక్టర్ బి. సతీష్ చంద్ర, డాక్టర్ సాయిరాం క్షేత్రస్థాయిలో సందర్శించి పంటలను పరిశీలించారు.రైతులు సాగు చేస్తున్న కేఎన్ఎం--1638, బీపీటీ--5204 (సాంబమసూరి), డబ్ల్యూజీఎల్--44 రకాల వరి నాట్లు నాటు వేసే దశ నుండి పిలక దశ వరకు ఉన్నట్లు గమనించారు. సాంబమసూరి రకంలో కాండం తొలచు పురుగు, ఉల్లికుడు ఉధృతి ఎక్కువగా ఉందని గుర్తించారు. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు పది కిలోల చొప్పున వేసుకోవాలని సూచించారు.వరి నాట్లు వేసిన 45 రోజులకు కాండం తొలచు పురుగు ఉధృతి గమనిస్తే క్లోరాన్ ట్రినిలిప్రోల్ మందును 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. చౌడు భూముల్లో జింక్ లోపాన్ని సవరించేందుకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. నాకు వేసిన 20--25 రోజుల దశలో ఉన్న పైర్లకు ఎకరాకు 35 కిలోల యూరియా వాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ గణేష్, ఎలిగేడు సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మర్రిగూడ ఆసుపత్రిలో బాధితుడి కుటుంబ సభ్యుల ఆందోళన



**మర్రిగూడ ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యంతో జరిగిన ఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన చేపట్టారు.ఆగస్టు 11న కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చిన కుర్మిల చంద్రయ్యకు చికిత్స అనంతరం మాత్రలు వేసుకోవడానికి నీరు అడగగా, సిబ్బంది పొరపాటున యాసిడ్ ద్రావం ఉన్న బాటిల్ అందజేశారు. దాన్ని తాగిన బాధితుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పేగులు దెబ్బతిన్నాయని గుర్తించి వెంటనే శస్త్రచికిత్స చేశారు.ఈ ఘటనపై బాధితుడి భార్య యాదమ్మ, కుమారుడు యాదగిరితో పాటు కుటుంబ సభ్యులు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శంకర్ నాయక్ ఛాంబర్‌ను ముట్టడించి న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. గ్రామ పెద్దలు మధ్యవర్తిత్వం చేస్తూ సూపరిండెంట్‌ను ప్రశ్నించగా, “ఇది మా నిర్లక్ష్యం కాదు, కాంటిన్జెన్సీ వర్కర్ ఇచ్చిన బాటిల్ వల్లే జరిగింది. అవసరమైతే సమగ్ర విచారణకు సిద్ధం” అని ఆయన తెలిపారు.కుటుంబ సభ్యులు మాత్రం సిబ్బంది బాధ్యత వహించి, తప్పిదం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మధ్యవర్తులుగా వచ్చిన పెద్దలు, పోలీసులు బాధితులను శాంతింపజేశారు. కాంటిన్జెన్సీ వర్కర్ విధులకు రాకపోవడంతో, రేపు విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేస్తామని సూపరిండెంట్ హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

# ఉత్తమ ఎంపీడీవోగా అవార్డ్ అందుకున్న పెరుమాళ్ల సునీల్



**దేవరకొండ, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేరేడుగొమ్ము మండల ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పెరుమాళ్ల సునీల్ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ అవార్డును అందుకున్నారు.నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ల బాలలింగయ్య--లలితమ్మ దంపతుల రెండవ సంతానం సునీల్. పేద కుటుంబంలో జన్మించిన ఆయన, పేద ప్రజలకు సేవ చేయాలనే తపనతో కష్టపడి ఉద్యోగం సంపాదించారు.రాష్ట్ర రోడ్డు రవాణా, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘువీరా రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీరా రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ, “ఈ అవార్డు నాపై మరింత బాధ్యతను పెంచింది. ప్రజలకు సేవ చేయడంలో మరింత కృషి చేస్తాను” అని పేర్కొన్నారు. గ్రామస్తులు ఆయన విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

# మృతుడి కుటుంబానికి అండగా మాజీ సర్పంచ్



**పాములపాడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేంపెంట గ్రామానికి చెందిన ఆకుల నాగేంద్ర (50) గుండెపోటుతో మృతి చెందగా, మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి, కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.ఆ కుటుంబానికి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బోనపల్లె సత్యరాజు, ముద్దపాటి ప్రసాద్, దార ప్రసన్న, బోనపల్లె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వేదికలో అర్జీల స్వీకరణ



**నంద్యాల, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణ, వీధి కుక్కల నివారణకు వినతి



**నందికొట్కూరు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పట్టణంలో చెత్త కుండీల వద్ద గోవులు వ్యర్థాలు తిని అనారోగ్యానికి గురవుతున్నాయని, వీధి కుక్కలు పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆవాజ్ కమిటీ నాయకులు తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ రహిమాన్ మాట్లాడుతూ, రహదారులపై గోవులు అడ్డంగా నిల్చోవడం, వ్యర్థాలు తినడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గోవులను గోశాలకు తరలించి సంరక్షణ కల్పించాలని, వీధి కుక్కల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామి రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు అబ్దుల్లా, ఆదాము, హకీమ్, మునవ్వర్, ఆయిల్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఏడీఏగా గౌరవం పొందిన ఎం. గిరీష్



**నందికొట్కూరు, ఆగస్టు 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నంద్యాల జిల్లాలో ఉత్తమ ఏడీఏగా ఎం. గిరీష్‌కు ప్రశంసా పురస్కారం లభించింది.వ్యవసాయ శాఖ సబ్-డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడిగా రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, పథకాలు, సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా కృషి చేసిన సేవలకు ఈ గౌరవం లభించిందని డీలర్, సామాజిక సేవకుడు గుజ్జుల గౌరీశ్వర నాయుడు అభినందించారు. రైతు సేవకు దక్కిన ఈ గౌరవం మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ప్రేరణగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, నందికొట్కూరు పట్టణ వ్యవసాయ డీలర్లు పాల్గొన్నారు.

# 85శాతం సబ్సిడీతో పశు భీమా




**పాములపాడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** 2026--27 సంవత్సరానికి గాను మండలంలో 220 జీవాలకు భీమా లక్ష్యం నిర్దేశించామని పశువైద్యాధికారి డాక్టర్ పి. భాస్కర్ తెలిపారు.గొర్రెలు, మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని ఆయన సూచించారు. 6 నెలలు దాటిన గొర్రెలు, మేకలకు భీమా వర్తిస్తుందని, రూ.6,000 భీమా కోసం లబ్ధిదారులు కేవలం రూ.27 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. మిగతా రూ.153 ప్రభుత్వ సబ్సిడీగా భరించనుంది.ప్రతి జీవికి చెవి పోగు/ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలని, అది లేకపోతే భీమా వర్తించదని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది తిరుమలేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లున్నా కేసీ రైతుల కష్టాలు



**నందికొట్కూరు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కృష్ణా నది నీళ్లు పక్కనే ఉన్నా కేసీ కెనాల్ రైతులు నీటి లభ్యత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కుడిచెర్ల గ్రామంలో ఎండిన కేసీ కెనాల్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, వేల ఎకరాల్లో పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని, తినడానికి అన్నం కూడా దొరకని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మల్యాల లిఫ్ట్ ద్వారా కేసీ కెనాల్‌కు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలగను రిజర్వాయర్ మరమ్మత్తులు చేయకపోవడం వల్ల రెండు మండలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు మరో మూడు మండలాలకు ఆసరాగా ఉన్న కేసీ కెనాల్‌లో నీరు లేకపోతే రైతాంగం దారుణ స్థితిలో పడుతుందని ఆయన పేర్కొన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జోక్యం చేసుకొని నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మాగబుల్ బాషా, నరసింహ, నాగన్న, షేక్షావలి, దస్తగిరి, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



**గడివేముల, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గడివేముల మండలంలోని బిలకల గూడూరు గ్రామంలో సోమవారం నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మహిళలు పాలు, పూలు, చీరలతో పుట్టల వద్దకు, దేవాలయాల్లోని నాగుల కట్ట వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు ఆచరించారు. అనంతరం కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం స్వామివారిని ప్రార్థిస్తూ మొక్కులు తీర్చుకున్నారు.

# అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతపై టీడీపీ నాయకుల పరిశీలన



నందికొట్కూరు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నందికొట్కూరు పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను చైర్మన్ ధర్మారెడ్డి, టిడిపి నాయకులు సురేంద్ర, రజనీకాంత్ రెడ్డి కలిసి సందర్శించారు. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి, భోజనం చేస్తున్న ప్రజలతో వసతులపై ఆరాతీశారు. అనంతరం క్యాంటీన్ రిజిస్టర్‌లో తమ పేర్లు, హోదాలను నమోదు చేశారు. టిడిపి నాయకులు క్యాంటీన్ సందర్శించినప్పుడు రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేయాలని చైర్మన్ ధర్మారెడ్డి సూచించారు.

# నాగుల పంచమి వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ రమాదేవి సంపత్



ఎలిగేడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ర్యాకల్ దేవ్‌పల్లి, రాములపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో నాగుల పంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని, గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని నాగలింగేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. నాగుల పంచమి పర్వదినం ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభాగ్యాన్ని నింపాలని ఆకాంక్షించారు.

## భవాని రామలింగేశ్వర ఆలయంలో ప్రసాద వితరణ



ఎలిగేడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మండల కేంద్రంలోని శ్రీ భవాని రామలింగేశ్వర శివాలయంలో మొదటి శ్రావణ సోమవారం, నాగుల పంచమి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవను మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్--శ్రీలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో చేపట్టారు. మహిమ కలిగిన ఈ శివాలయంలో భక్తులు కొబ్బరికాయలు, పూలమాలలు సమర్పించి ధూపదీప నైవేద్యాలతో స్వామివారిని ఆరాధించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సేగమ దయాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల కుల పెద్దలు గుర్రం లక్ష్మీనారాయణ గౌడ్, ఉస్కోయిల భూపతి, కట్ల ప్రకాష్, కవంపల్లి నారాయణ, నక్క మల్లయ్య, చెదల లచ్చయ్య, అమ్ముల శ్రీనివాస్, ముత్కల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడు సర్పంచుల చేత డీఆర్డీఏ పీడీకి సన్మానం



ఎలిగేడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎలిగేడు మండలంలోని రాములపల్లి (ర్యాకల్ దేవుపల్లి)లోని శ్రీ నాగలింగేశ్వర ఆలయాన్ని సోమవారం డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కాళిందిని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు సిద్ధి తిరుపతి యాదవ్, మద్దెల రమాదేవి--సంపత్ ఘన స్వాగతం పలికారు. పీడీ కాళిందిని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం సర్పంచులు ఆమెను శాలువాతో సన్మానించి సత్కరించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

# పెండింగ్ డీఏల మంజూరుతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కావాలి



ఎలిగేడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):పెండింగ్లో ఉన్న ఆరు డీఏలను వెంటనే మంజూరు చేయాలని పెద్దపల్లి జిల్లా టీపీయూఎస్ ప్రధాన కార్యదర్శి గుండవేన జగన్ డిమాండ్ చేశారు. ఎలిగేడు మండలంలో టీపీయూఎస్ (తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం మండల అధ్యక్షుడు గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్, అదనపు కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం టీపీయూఎస్ మాత్రమే నిరంతర పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ఎలిగేడు ప్రజావాణిలో 08 దరఖాస్తులు



ఎలిగేడు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో భాస్కర్ రావు ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. మొదటి రోజున ప్రజావాణిలో మొత్తం 08 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. అందులో ఇందిరమ్మ ఇళ్లకు 02, గృహజ్యోతి 03, పెన్షన్‌కు 02, పశువుల కొట్టంకు 01 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఏవో ఉమాపతి, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, విద్యుత్ ఏఈ సంపత్ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనిత, ఏపీఎం గీత, మండలస్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు లయన్స్ క్లబ్ అండ.. 32 మందికి కంటి చికిత్స



**– 65 మందికి కంటి పరీక్షలు.. కంటి దానంపై అవగాహన కల్పించిన ఎం. చంద్రశేఖర్**

ఆమనగల్లు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్): లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్‌రెడ్డి లయన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని లయన్ రామ్‌రెడ్డి విజన్ సెంటర్‌లో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 65 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించగా, కంటి సమస్యలు ఉన్న 32 మందిని మెరుగైన చికిత్స కోసం రామ్‌రెడ్డి లయన్ ఐ హాస్పిటల్‌కు తరలించినట్లు క్లబ్ పీఆర్ఓ పాషా తెలిపారు. వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ వృద్ధులకు, కంటి చూపు మందగించిన వారికి కంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కంటి దానానికి ముందుకు రావాలని కోరారు. కళ్లను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బి. యాదయ్య, లయన్స్ సభ్యులు కర్నాటి కొండల్‌రెడ్డి, పీఆర్ఓ పాషా, శిరీష ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**– ఆమనగల్ మండల ప్రజావాణిలో 27 వినతులు స్వీకరణ.. సత్వర పరిష్కారానికి అధికారుల ఆదేశాలు**



ఆమనగల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మండల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఆమనగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జైరామ్ విజయ్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 27 వినతులను అధికారులు స్వీకరించారు. గృహ నిర్మాణ శాఖకు అత్యధికంగా 15 వినతులు అందగా, వ్యవసాయ శాఖకు 3, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖలకు చెరో 2, విద్యుత్, బీసీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖలకు చెరో ఒక వినతి అందింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జైరామ్ విజయ్, తహసీల్దార్ ఫహీం ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ప్రభుత్వ నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి వినతిపై తీసుకున్న చర్యలను నమోదు చేసి, పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వినతులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల మధ్యకు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్



**– మార్నింగ్ వాక్‌తో సమస్యలపై ఆరా.. పారిశుధ్య పనుల పరిశీలన**

ఆమనగల్లు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ సోమవారం పట్టణంలో పర్యటించారు. 13వ వార్డు కౌన్సిలర్ అనూష శ్రీశైలంతో కలిసి మున్సిపల్ సిబ్బందితో మార్నింగ్ వాక్‌లో పాల్గొని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి సంబంధిత సిబ్బంది సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు చేపడతామని చెప్పారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని పత్య నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో పాలాభిషేకం



**– నాగుల పంచమి సందర్భంగా అంగడి బజారు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు**

ఆమనగల్లు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నాగుల పంచమి పర్వదినం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని అంగడి బజారు హనుమాన్ దేవాలయంలో నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి శ్వేతా రాము దంపతులు ఆలయానికి చేరుకుని నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేసి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని పాపిశెట్టి శ్వేతా రాము దంపతులు ఆకాంక్షించారు. నాగుల పంచమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో భక్తుల సందడి నెలకొంది. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగదేవతలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాపిశెట్టి కల్యాణి, అరవింద్‌తో పాటు భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఫోర్ వీలర్ స్కూటీ కోసం ప్రజావాణిలో వినతి



కురవి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కురవి మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో నల్లెల గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఎస్.డి. ఖాజా ఉచితంగా ఫోర్ వీలర్ స్కూటీ మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఖాజా మాట్లాడుతూ, "దివ్యాంగుల హక్కుల కోసం నేను గత 15 సంవత్సరాలుగా కృషి చేస్తున్నాను. ప్రయాణం చేయాలంటే వాహనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. అందుకే నాకు ఫోర్ వీలర్ స్కూటీ ఉచితంగా ఇవ్వాలని కోరుతున్నాను" అని తెలిపారు. ఈ వినతిపై స్పందించిన డోర్నకల్ ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచందర్ నాయక్ దివ్యాంగుడికి వాహనం మంజూరు చేయాలని అధికారులను కోరారు. ప్రజావాణి వేదికగా వినిపించిన ఈ అభ్యర్థనపై అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బోడుప్పల్‌లో గుంతల రోడ్లపై విన్నూత నిరసన



బోడుప్పల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):బోడుప్పల్ సర్కిల్--10 పరిధిలోని సాయిబాబా గుడి, వీరరెడ్డి నగర్ చౌరస్తా వద్ద సోమవారం గుంతల రోడ్లకు వ్యతిరేకంగా విన్నూత నిరసన కార్యక్రమం జరిగింది. బోడుప్పల్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి శ్రీమతి ప్రగతి ఆధ్వర్యంలో కార్యకర్తలు నల్ల మాస్కులు ధరించి, ప్లాకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ప్రగతి మాట్లాడుతూ, "పేరుకే గ్రేటర్ బోడుప్పల్ అంటున్నారు. గుంతల రోడ్ల వలన ప్రతిరోజూ భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉద్యోగస్తులు, స్కూల్ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర వాహనం 108 కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మరింతగా, "నడవడానికి రోడ్లు సరిగా లేకున్నా బార్లు, వైన్‌షాపులకు మాత్రం అనుమతులు ఇస్తున్నారు. ప్రజా సమస్యలపై స్పందించని నాయకులు, అధికారులు వెంటనే గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభ్యర్థులు లీలావతి, రమాదేవి, జై కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కుమారస్వామి



నల్లగొండ, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించబడటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని నారోజు కుమారస్వామి తెలిపారు. సోమవారం రాష్ట్ర బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న ఆయన మాట్లాడుతూ, "పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం బీజేపీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తాను" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మేడిపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ధర్నా



మేడిపల్లి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మేడిపల్లి మండల కార్యాలయం వద్ద సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, "గత ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలి. ఆడబిడ్డలు ఉన్న పేద తల్లిదండ్రులకు ఇవి ఎంతో ఆసరాగా నిలుస్తాయి" అని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, మీసాల కృష్ణ, కొత్త చక్రపాణి గౌడ్, రాసాల బాల మల్లేష్ యాదవ్, బంధారం శ్రీధర్ గౌడ్, విప్లవ్ రెడ్డి, అలాగే పీర్జాదిగూడ బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ధర్నా సందర్భంగా కార్యకర్తలు నినాదాలు చేస్తూ పథకాల కొనసాగింపుపై ప్రభుత్వాన్ని ఒత్తిడి తేవాలని కోరారు.

# కలెక్టర్ కార్యాలయం ముట్టడించిన బీఆర్ఎస్ నాయకులు



నల్లగొండ, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కొనసాగింపునకు డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోంది. రూ.1.16 లక్షల ఆర్థిక సాయం ఆపితే ఊరుకోం. ఎన్నికల హామీ మేరకు తులం బంగారం వెంటనే ఇవ్వాలి. మూడేళ్లుగా తులం బంగారం ఎక్కడ?" అని నిలదీశారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, "కల్యాణలక్ష్మి పథకం రద్దుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తోంది. హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ 9 నెలలుగా లబ్ధిదారులకు చెల్లింపులు నిలిపివేసింది. 13 లక్షల పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాన్ని కొనసాగించాలి. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలి. లేకపోతే బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయపోరాటానికి సిద్ధంగా ఉంటుంది" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో భాగంగా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రకటించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకం. అర్హులైన ప్రతి పౌరుడి పేరు తప్పనిసరిగా జాబితాలో ఉండాలి. అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను సరిచేయడమే ఎస్‌ఐఆర్ ప్రధాన ఉద్దేశం" అని తెలిపారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సేకరించారు. ఆ వివరాలను రికార్డులతో సరిపోల్చి, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం డ్రాఫ్ట్ జాబితా రూపొందించారు. ప్రస్తుతం జిల్లాలో 6,18,592 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు. వీరిలో 3,11,395 మంది పురుషులు, 3,07,182 మంది మహిళలు, 15 మంది ఇతరులు, 579 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. పరిశీలనలో 22,669 మంది మరణించిన ఓటర్లు, 18,260 మంది ఫారాలు సమర్పించని వారు, 20,396 మంది ఇతర ప్రాంతాలకు ఓటు మార్చుకున్న వారు గుర్తించబడ్డారు. డ్రాఫ్ట్ జాబితాపై సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 19న విడుదల కానుంది. కలెక్టర్ సూచనల ప్రకారం, ప్రతి ఓటరు తన పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, చిరునామా, వయస్సు, లింగం వంటి వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలి. తప్పులు ఉంటే నిర్ణీత విధానంలో సవరణకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, డిప్యూటీ కలెక్టర్ కల్పన, అలాగే బీజేపీ, కాంగ్రెస్, వైయస్సార్సీపీ, టిడిపి, బీఆర్ఎస్, సిపిఎం పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు




**నాగర్‌కర్నూల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చెన్నయ్యతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు, వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును ఎప్పటికప్పుడు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి. పరిష్కరించిన వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి" అని స్పష్టం చేశారు. ఫిర్యాదు తమ శాఖ పరిధిలోకి రాని పక్షంలో సంబంధిత శాఖకు పంపించి, ఆ విషయాన్ని ఫిర్యాదుదారునికి తెలియజేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం పరిష్కారం సాధ్యం కాకపోతే, స్పష్టంగా వివరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 36 దరఖాస్తులు జిల్లా స్థాయిలో స్వీకరించగా, మండల స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాల్లో 103 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఉద్దేశించి, "పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన వినతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వరమే చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై బీఆర్ఎస్ పోరుబాట

**– హామీ మేరకు తులం బంగారంతో పాటు రూ.1,16,000 ఇవ్వాలి: కదారి రామకృష్ణ**



**కడ్తాల్, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ కదారి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు గత ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.1,16,000తో పాటు తులం బంగారం అందజేస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పథకాల అమలులో జాప్యం చేయకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే గ్రామస్థాయి నుంచి ప్రజల తరపున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సువాలి పంతు నాయక్, వీరయ్య, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అటెండర్ అనసూయమ్మకు న్యాయం చేయాలి

**– పూర్తి పారితోషికం అందేలా విచారణ చేపట్టాలని ఎంఈఓకు వినతి**



**ఆమనగల్లు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంపుగూడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న పత్తి అనసూయమ్మకు పూర్తి పారితోషికం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ సోమవారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నిర్మలకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో సుమారు 50 ఏళ్లుగా సేవలందిస్తున్న అనసూయమ్మకు నెలకు రావాల్సిన రూ.3,000లో రూ.1,500 మాత్రమే అందుతున్నట్లు ఆమె ఫిర్యాదు చేసినట్లు అశోక్ తెలిపారు. మిగిలిన రూ.1,500ను పాఠశాల అభివృద్ధి కోసం వినియోగిస్తున్నట్లు ఉపాధ్యాయురాలు చెబుతున్నారని పేర్కొన్నారు. తాను పాఠశాలలో పారిశుద్ధ్య పనులతో పాటు అటెండర్ విధులు నిర్వహిస్తున్నానని అనసూయమ్మ తెలిపినట్లు ఆయన వివరించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, అటెండర్‌కు రావాల్సిన పూర్తి పారితోషికం అందేలా చర్యలు తీసుకోవాలని అశోక్ కోరారు. 50 ఏళ్లుగా పాఠశాలకు సేవలందిస్తున్న అనసూయమ్మకు న్యాయం జరిగే వరకు ఆమెకు అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి, కడ్తాల్ టౌన్ అధ్యక్షుడు బాను కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చాల గ్రామంలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించిన శ్రీశ్రీ బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలి" అని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యు వజన నాయకులు, మహిళా నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వినతులు తక్షణమే పరిష్కరిస్తాం



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా మండల స్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని కల్వకుర్తి ఎంపీడీఓ జిల్లెల్ల సునీత తెలిపారు. సోమవారం కల్వకుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు తమ వినతులను నేరుగా అందజేయవచ్చని ఎంపీడీఓ సూచించారు. ఈ సందర్భంగా ఎల్లికట్ట సర్పంచ్ అమృత భీమయ్య విద్యుత్ సమస్యపై వినతిపత్రం సమర్పించారు. మండల పరిధిలోని గ్రామ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో వినతులు అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, "ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు.

## ప్రతి కుటుంబంలో ఒకరు ఉద్యోగి కావాలన్న సంకల్పం సుంకిరెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తుక్కుగూడలో ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ నిర్వహించిన జాబ్ డ్రైవ్ -- ఇంటర్వ్యూ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఒ టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతి కుటుంబంలో ఒకరు ఉద్యోగి కావాలన్నదే నా సంకల్పం. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ప్రతి ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగం గానీ, ప్రైవేట్ ఉద్యోగం గానీ ఏదో ఒక ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆర్థిక స్థిరత్వం తీసుకురావాలి" అని సూచించారు. యువతకు ఉపాధి కల్పించడం, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడం లక్ష్యంగా ఇలాంటి జాబ్ డ్రైవ్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఆమనగల్ మండలం నుండి 8 మంది, తలకొండపల్లి మండలం నుండి 3 మంది, వెల్దండ మండలం నుండి 11 మంది -- మొత్తం 22 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర, శ్రీనివాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, చంద్రశేఖర్, అలాగే ఇంటర్వ్యూకు హాజరైన యువత పాల్గొన్నారు.

# 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణ పురోగతిని, ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ దశల పనులను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. "ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని ఎలాంటి జాప్యం లేకుండా, నిర్ణీత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలి" అని ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట సమన్వయం చేసుకుంటూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు అత్యవసర మరియు నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, సమయానికి మెరుగైన వైద్యం పొందే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పట్టణ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఎమ్మెల్యే గారితో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు.

# ఈదమ్మ గుడి నిర్మాణానికి విరాళం



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చారకొండ మండలం జేపల్లీ గ్రామ పంచాయతీ పరిధిలోని దొడ్లపల్లి గ్రామ ఈదమ్మ గుడి నిర్మాణానికి వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు రూ.50,000 చెక్కును సోమవారం అందజేశారు. ఈ చెక్కును యువసేన అధ్యక్షుడు ఎండి సిరాజ్, జేపల్లీ గ్రామ ఉపసర్పంచ్ మధు ఎర్రవెల్లి, మాజీ సర్పంచ్ సాయి, బీఆర్ఎస్ యువ నాయకులు ప్రశాంత్, సత్యం యాదవ్ కలిసి ఈదమ్మ గుడి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మయ్య, కృష్ణయ్య, సత్యం, దిలీప్, అల్లాజి, అంజి, శివ, చింటూ, మహేష్, మాధవరెడ్డి, రామస్వామి, తిరుపతయ్య, శ్రీశైలంతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి పట్టణ ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించిన ఎస్‌ఐఆర్ కార్యక్రమం అనంతరం కల్వకుర్తి పట్టణ ఓటర్ల జాబితా ముసాయిదాను మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సోమవారం విడుదల చేశారు. కల్వకుర్తి పట్టణంలో మొత్తం ఓటర్లు 25,580గా ఉండగా, ఎస్‌ఐఆర్ సర్వే పూర్తి చేసిన తర్వాత మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, డబుల్ ఓట్లు ఉన్నవారిని తొలగించి, తాజా డ్రాఫ్ట్ జాబితా ప్రకారం 27 పోలింగ్ స్టేషన్లకు గాను 19,892 ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఓటర్ల వివరాలను పరిశీలించేందుకు ముసాయిదా జాబితాను పురపాలక సంఘ కార్యాలయం మరియు తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. తమ ఓటు వివరాలను పరిశీలించి, ఏవైనా మార్పులు చేయవలసి ఉన్నా లేదా పేరు లేకపోయినా సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

# భూకబ్జాదారుడిపై కఠిన చర్యలు కోరిన గుండూర్ గ్రామస్తులు



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండలం గుండూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 157, 158లో ఉన్న అవుసలి కుంట, కమ్మరి కుంటలను అక్రమంగా కబ్జా చేసి బోర్‌వెల్ వేసిన మహేశ్వరం అనిల్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కుంటలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, కబ్జాకు సహకరిస్తున్న అధికారుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ, "ప్రభుత్వ కుంటలు ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో నీటి వనరులకు తీవ్ర నష్టం కలుగుతుంది. వెంటనే సర్వే చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని పరిరక్షించాలి" అని కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పందిస్తూ, భూకబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ స్థలాలు మరియు కుంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో మెంట పర్వతాలు, నంబి వెంకటయ్య, మెంట లింగం, భాషమోని ఎల్లయ్య, కుమ్మరి జానయ్య తదితరులు ఉన్నారు.

# సుజాతకు ఉత్తమ ప్రతిభ పురస్కారం



**కల్వకుర్తి, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమగ్ర శిక్షా అభియాన్ పర్యవేక్షకురాలు సుజాత 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సూపరింటెండెంట్ ఉద్యోగ ప్రతిభ పురస్కారం అందుకున్నారు. ముఖ్య అతిథులు చిన్నారెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సుజాతను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. డీఈఓ మాట్లాడుతూ, "భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి" అని సూచించారు. ప్రత్యేకంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ స్కూళ్లు నిర్వహణను మెరుగుపరచి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల ఫలితాలు, మౌలిక వసతులు, బోధన, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సుజాతకు లభించిన ఈ పురస్కారం ఇతర ఉద్యోగులకు కూడా స్ఫూర్తిదాయకమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సొంత పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి సంచలన ఆరోపణలు!



**వనపర్తి** :అన్నీ చూస్తూ భరిస్తున్నా.. లేదంటే మరో జీవన్ రెడ్డిలా, సోనియా చెప్పినా నాకు టికెట్ రాకుం డా అడ్డుకున్నారు:వనపర్తి నియోజకవర్గాన్ని సర్వనాశనం చేస్తు న్నారని.. అయినా సరే, అన్ని భరిస్తూ పార్టీలో కొనసాగు తున్నానంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతకా లంగా పార్టీలో తప్పులు జరుగుతున్నాయని.. తప్పు చేస్తున్నవారని పంపిస్తామే కానీ తాము పార్టీని వదిలిపెట్టేది లేదన్నారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట కాంగ్రెస్ పార్టీ ఆఫీసును ప్రారంభించిన ఆయన తాజా పరిణామాలపై స్పందించారు. తాను పార్టీలో జరుగుతున్నవన్నీ చూస్తూ భరిస్తున్నాను కాబట్టి ఇంకా కొనసాగుతున్నానని. లేకపోతే మరో జీవన్‌రెడ్డిలా కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యేవాడినేమో అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.48 ఏళ్లుగా నిర్మించుకున్న కాంగ్రెస్ పార్టీని స్వార్థంతో కూలగొట్టి కలలను చెదరగొట్టారని.. అన్నింటికి కాలమే సమాధానం చెబుతుం దన్నారు చిన్నారెడ్డి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వమని సోనియాగాంధీ చెప్పినా.. కొంతమంది డబ్బులకు ఆశపడి తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వనపర్తి అభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేశానని.. తాను ఎక్కడా, ఎలాంటి అక్రమాలు, అవినీతికి పాల్పడలేద న్నారు. పదేళ్ల పాటూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్ని కాపాడుకుంటూ వచ్చానన్నారు. గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి నేతల్ని ఆహ్వానించినా రాకపోవడం బాధగా ఉందన్నారు. తాను ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని.. పార్టీ కోసం పనిచేయాలని, ఎలాంటి పనులు కావాలన్నా చేయడానికి కేబినెట్ స్థాయిలో తానున్నానని పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు.

సొంత పార్టీలో నాయకులు నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనుల్ని అడ్డుకుంటున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. తాను అభివృద్ధి పనులు చేపడితే కాంట్రాక్టుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నా రు. ముఖ్యమంత్రి రేవంతమండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభో స్టల్స్ నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఆ పనులు జరగడం లేదని ఆరోపిం చారు. ఈ పనుల గురించి మంత్రి, అధికారుల దగ్గరకు వెళ్లి అడిగానన్నారు. సొంత పార్టీలో వాళ్లే ఈ పనులు అడ్డుకున్నారని తనకు తెలిసిందన్నారు. గోపాల్‌పేట మండలంలో వ్యవసాయ మార్కెట్‌ను తీసుకెళ్లి ఎక్కడో అడవిలో నిర్మించారని చిన్నారెడ్డి ఆరోపించారు. మొత్తం మీద చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు తెల ంగాణ కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి.

# డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ

**- సెప్టెంబర్ 16లోపు దావాలు, అభ్యంతరాలు సమర్పించాలి**

**ఆమనగల్లు: ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేసినట్లు సహాయ ఓటరు నమోదు అధికారి (ఏఈఆర్ఓ), ఆమనగల్లు తహసీల్దార్ తెలిపారు. ఓటర్ల నమోదు నిబంధనలు--1960 ప్రకారం రూపొందించిన ఈ జాబితా ప్రతులను కార్యాలయ పని వేళల్లో ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంతో పాటు సంబంధిత నిర్దేశిత కేంద్రాల్లో పరిశీలించేందుకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.ఓటర్ల జాబితా తయారీకి అర్హత తేదీగా 01-10-2026ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అర్హత తేదీ ఆధారంగా ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవాలనుకునే వారు, పేరు చేర్పుపై అభ్యంతరం ఉన్న వారు లేదా జాబితాలోని వివరాలపై అభ్యంతరాలు ఉన్న వారు 16-09-2026లోపు సంబంధిత ఫారం--6, 6ఏ, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దావాలు, అభ్యంతరాలను ఆమనగల్లు మండల తహసీల్దార్ కార్యాలయంలోని సహాయ ఓటరు నమోదు అధికారి కార్యాలయంలో, కల్వకుర్తి రెవెన్యూ డివిజనల్ అధికారి, ఓటరు నమోదు అధికారి కార్యాలయంలో లేదా సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సమర్పించవచ్చని తెలిపారు. పోస్టు ద్వారా పంపే దరఖాస్తులు కూడా నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారికి చేరేలా పంపించాలని సూచించారు.

# డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా నోటీసు ప్రదర్శన



**ఆమనగల్లు, ఆగస్టు 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** 83--కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 01.10.2026 అర్హత తేదీతో రూపొందించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించిన ఫారం--5 నోటీసును సోమవారం ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 17.08.2026న ప్రజల సమాచారార్థం నోటీసును ప్రదర్శించినట్లు తెలిపారు. ఓటర్లు నోటీసు బోర్డును పరిశీలించి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో తమ పేర్లు, వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించుకోవచ్చని కమిషనర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఓటర్లందరూ ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్రను మార్చలేవు



**హైదరాబాద్ :** ఆలోచన, ఆచరణ కేసీఆర్‌ది అయితే.. ప్రచారం కాంగ్రెస్‌ది అన్నట్లు ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చినట్టే.. కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంపై ఆయన స్పందించారు. డేట్లు, డెడ్‌లైన్లు మార్చుకుంటూ పోయి, చివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న దవాఖానలో కూడా పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడం శోచనీయమన్నారు. వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మించిన హాస్పిటల్‌ను కేవలం ఓపీ సేవలకే పరిమితం చేయడం సిగ్గుచేటన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్ర మార్చలేవన్నారు. హైదరాబాద్‌కు మూడు వైపులా మూడు టిమ్స్ హాస్పిటల్స్ (అల్వాల్, సనత్‌నగర్, ఎల్బీనగర్) ఏర్పాటు చేసి, పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నది కేసీఆర్ ఆలోచన. కరోనా తర్వాత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వందేళ్ల ముందు చూపుతో కేసీఆర్ రూపకల్పన చేశారన్నారు. 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు మూడు ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ దవాకానలకు శంకుస్థాపన చేసి చరిత్ర సృష్టించారు. ప్రణాళిక కేసీఆర్‌ది.. శంకుస్థాపన కేసీఆర్‌ది.. నిధులు విడుదల చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందిఒక్కో ఆసుపత్రి వెయ్యి పడకల సామర్థ్యంతో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో నిర్మించే మూడింటి నిర్మాణానికి రూ.2,679 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో శరవేగంగా సాగిన పనులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నత్తనడకన సాగాయి. సకాలంలో పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మూడున్నరేళ్ల సుదీర్ఘ కాలంలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించకుండా, కేవలం ప్రచారం కోసం నేడు ౧×మీా సనత్‌నగర్‌ను ప్రారంభిస్తున్నారు. కనీసం హాస్పిటల్‌కు నీటి సరఫరా కూడా కల్పించలేదు అంటే పేదల వైద్యం పట్ల వీరికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవుతుంది.సేవలు అందించాలి కేసీఆర్ పూర్తి ఉచితంగా ఉచితంగా వైద్య సేవలు అందించాలికేసీఆర్ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆలోచిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల నుంచి ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరవండి. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో మొదలు పెట్టిన టిమ్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# వరదొచ్చినా నీళ్లు నిల్వ చేసుకోలేని దుస్థితి



**మహబూబ్‌నగర్ జిల్లా:**ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఈ ఏడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడపాదడపా వర్షాలు పడుతున్నా జలాశయాలు, చెరువులు పూర్తిస్థాయిలో నిండడం లేదు. మరోవైపు ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదికి ఆలస్యంగానైనా భారీగా వరద చేరుతోంది. అయితే ఆ వరదను ఒడిసిపట్టుకుని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేంత గా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిల్వ సామర్థ్యం లేకపోవడం రైతులకు శాపంగా మారింది.వరద నీరు వస్తుందని సంబరపడేలోపే నిల్వ చేసుకునే అవకాశం లేక అది దిగువకు వెళ్లిపోతోంది. ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, అందుకు అనుగుణంగా జలాశయాలు, ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థా యిలో అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ప్రతి ఏటా ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది.190 టీఎంసీల వరద - 175.5 టీఎంసీలు దిగువకే : వర్షాభావ పరిస్థితుల్లో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో నారాయణపూర్ డ్యామ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో కేవలం 18 రోజుల వ్యవధిలో జూరాల ప్రాజెక్టుకు దాదాపు 190 టీఎంసీల వరద నీరు చేరింది. అయితే ఇందులో ఏకంగా 175.5 టీఎంసీలు దిగువకు విడుదల చేయాల్సి వచ్చింది. మిగిలిన 14.5 టీఎంసీలలో 11.5 టీఎంసీలను నెట్టెంపాడు, భీమా-1, భీమా-2, కోయిలసాగర్ ప్రాజెక్టులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు వినియోగించారు. మరో 3 టీఎంసీల నీరు మాత్రమే జూరాల ప్రాజెక్టులో నిల్వ ఉంది. భారీగా వరద వచ్చినా దాన్ని నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడం ఉమ్మడి జిల్లా సాగునీటి పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తోంది. జలాశయాలు అందుబాటులోకి వస్తేనే భరోసా : ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితు లు ఎదురైనప్పుడు ముందుగానే నీటిని నిల్వ చేసుకునే జలాశయాలు ఉంటేనే రైతులకు కొంత భరోసా ఉంటుంది. నెట్టెంపాడు కింద గుడ్డెందొడ్డి జలాశయం నిల్వ సామర్థ్యాన్ని 1.20 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే ప్రతిపాదన ఉంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట నిర్మాణానికి భూసేకరణ చర్యలు కొనసాగుతున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 58.4 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఎక్కడికక్కడ రిజర్వాయర్లు, జలాశయాలు అందుబాటులోకి వస్తేనే భవిష్యత్తు లో సాగునీటి అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంటుంది.ఐదు నెలలు వరద ఉంటేనే సాగునీరు : ఉమ్మడి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణానదిలో సుమారు ఐదు నెలలపాటు నిరంతర ప్రవాహం కొనసాగితేనే ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి ఉంది. మిగిలిన కాలంలో నీటి లభ్యత తగ్గిపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.కేటాయింపులు ఉన్నా వినియోగం అంతంతే : వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం నీటి కేటాయింపులు చేసినప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. జూరాలకు 17 టీఎంసీలు, నెట్టెంపాడుకు 21 టీఎంసీలు, భీమా-1, భీమా-2కు కలిపి 20 టీఎంసీలు, కోయిలసాగర్‌కు 3.9 టీఎంసీలు, కేఎల్ఐకి 40 టీఎంసీలు, ఆర్డీఎస్ కింద 15.9 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి.

# తెలంగాణ మీద పూర్తిగా ఆశలు వదులుకున్న కేంద్ర బీజేపీ..



**హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. వచ్చే ఎన్నికల్లో అధికారం మాదేనని ఎంత దీమాతో ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర నాయత్వం ఆశలపై ఆ పార్టీ అధిష్ఠానం నీళ్లు చల్లినట్లయిం ది. సోమవారం భారతీయ జనతా పార్టీ కొత్త టీమ్‌ను ప్రకటించింది. అనేక మంది ముఖ్య నేతలకు. పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించా రు. అయితే జాతీయ స్థాయిలోగ తెలంగాణ ప్రాధాన్యత తగ్గిపోయింది. ముగ్గురు కీలక నేతల జాతీయ పదవులకు ఎండ్ కార్డ్ పలికారు.గతంలో తెలంగాణకు దక్కిన మూడు కీలక జాతీయ పదవులను బీజేపీ హై కమాండ్ తొలగించింది. గతంలో తెలంగాణ నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలిగా డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కే. లక్ష్మణ్ వ్యవహరించారు. ఇప్పుడు కొత్తగా ప్రకటించిన జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు ఒక్క పదవి కూడా దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో బీజేపీకి భష్యత్ లేదనే ఉద్దేశంతోనే ఇక్కడి నాయకత్వాన్ని పక్కన పెట్టిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# లక్షలాది కుటుంబాలకు అండగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్



**వేల్పూర్ :** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలు, మహిళలు, రైతులు, వృద్ధుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలను నిరసిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రజల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహిళలతో కలిసి వీ=ాకి అందజేశారు.ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహ భారం తగ్గించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణలో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచాయని తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు గత పదేళ్లుగా విజయవంతంగా అమలవుతున్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం వారి అనుకూలమైన వ్యక్తితో కోర్టులో కేసు వేయించి ఈ పథకాన్ని రద్దు చేయాలన్న కుట్రలు చేస్తుంది. కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా ఈ పథకాలను కొనసాగిస్తామని ప్రభుత్వం కోర్టులో స్పష్టమైన అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయడం లేదు..? అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు.వచ్చే విచారణలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తామని ప్రకటించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి పథకం తొలుత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రూ.50,000 సహాయంతో ప్రారంభమై, అనంతరం బీసీలతో పాటు అన్ని వర్గాల పేదలకు విస్తరించిందని వేముల గుర్తుచేశారు. ఆర్థిక సహాయాన్ని దశలవారీగా పెంచుతూ చివరకు రూ.1,00,116కు చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.

# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా అధికారులు పని చేయాలి’

**చుంచుపల్లి, ఆగస్టు 17 :** ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి అవసరాలను గుర్తించి సేవలు అందించాలని ఎమ్మెల్యే కోననేని సాంబశివరావు అధికారులకు సూచించారు. సోమవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఎంపీడీవో సుభాషిణితో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి అందరూ అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా అధికారులు పని చేయాలని, అందిన వినతులను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 22 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. గృహజ్యోతి, ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళల పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, డ్రైనేజీ కాలువలు తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ నాగరాజు, ఎంపీఓ సంధ్య పాల్గొన్నారు.

# అల్లు అరవింద్ కామెంట్స్ పై యశ్ స్పందన

**అందరి కష్టం తోడైతేనే మంచి అవుట్‌పుట్ వస్తుందన్న యశ్**



'కేజీఎఫ్' చిత్రంతో దేశ వ్యాప్తంగా అద్భుతమైన గుర్తింపు తెచ్చుకున్న కన్నడ రాకింగ్ స్టార్ యశ్... ప్రస్తుతం తన రాబోయే చిత్రం 'టాక్సిక్' ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, గతంలో అల్లు అరవింద్ తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఒక ఇంటర్వ్యూలో సుదీర్ఘంగా స్పందించారు. కేజీఎఫ్ చిత్రం తన కెరీర్‌ను మలుపు తిప్పిందనే విషయాన్ని ఒప్పుకుంటూనే, ఒక సినిమా విజయం, దానికి వచ్చే గుర్తింపుపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.ఒక సినిమా వల్ల నిర్మాత కంటే హీరోకే ఎక్కువ గుర్తింపు వస్తుందనే అంశంపై యశ్ మాట్లాడుతూ... విజయం అనేది కేవలం నిర్మాతకు లేదా ఒక్క వ్యక్తికి మాత్రమే సొంతం కాదని స్పష్టం చేశారు. క్యారెక్టర్ ఆర్టిస్టుల నుంచి రచయితల వరకు అందరి కష్టం తోడైతేనే మంచి అవుట్‌పుట్ వస్తుందని, ప్రధాన పాత్రలో నటించేవారు సరిగ్గా చేయలేకపోతే సినిమా కచ్చితంగా విజయం సాధించదని తెలిపారు. ప్రేక్షకుల నిర్ణయం ఎప్పుడూ తప్పు కాదని, ఎవరి శ్రమకు తగిన గౌరవం వారికి ఇవ్వడంలో ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. ఎంతటి స్టార్ హీరో తలరాతనైనా శుక్రవారం విడుదలయ్యే ఆ ఒక్క రోజే నిర్ణయిస్తుందని, సినిమా ఆడకపోతే 'పాన్-ఇండియా' ట్యాగ్ కూడా మాయమైపోతుందని వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా, 2023లో ఓ సినిమా వేడుకలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "కేజీఎఫ్ కంటే ముందు యశ్ ఎంతమందికి తెలుసు?" అని ప్రశ్నిస్తూ, భారీ నిర్మాణ విలువలే ఆ సినిమా అంత పెద్ద హిట్ అవ్వడానికి కారణమని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఈ కామెంట్స్ పై యశ్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, తాజాగా యశ్ స్పందిస్తూ.. ఇతరుల వ్యాఖ్యలు లేదా కామెంట్లు తన వ్యక్తిత్వాన్ని ఏమాత్రం మార్చలేవని తేల్చి చెప్పారు.



# అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.

# హీరోకి తగ్గ ఫ్యాన్స్..

**సామాజిక సేవలో అల్లు అర్జున్ అభిమానుల రికార్డు**



అభిమాన సంఘాలు అంటే కేవలం తమ హీరో సినిమాలను ప్రమోట్ చేయడానికే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతోనూ ముందుండొచ్చని ఐకాన్ స్టార్ 'అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్' (ఆఫా) నిరూపిస్తోంది. దేశవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి మన్ననలు పొందుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వస్థ్ నారీ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా 'ఆఫా' ఓ అరుదైన మైలురాయిని చేరుకుంది.

దేశంలోని ఏడు రాష్ట్రాల్లో 400కు పైగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, సుమారు లక్ష మంది యువతులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, సర్వైకల్ క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించింది. యువతులు, బాలికలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో అల్లు అర్జున్ అభిమానులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేవలం సినిమాలపైనే కాకుండా సామాజిక అంశాలపై కూడా దృష్టి సారిస్తున్న 'ఆఫా' సభ్యుల కృషికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# భారత్‌లో 'స్పైడర్ మ్యాన్' వసూళ్ల సునామీ..

**రూ. 500 కోట్లు కొల్లగొట్టిన హాలీవుడ్ చిత్రం..**

హాలీవుడ్ స్టార్స్ టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. జులై 31న విడుదలైన ఈ సినిమా, అంచనాలకు మించి భారీ విజయాన్ని నమోదు చేస్తూ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 19,120 కోట్లు) మార్క్‌ను దాటింది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) నుంచి 38వ చిత్రంగా వచ్చిన ఈ సినిమా, కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది.



ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా సంస్థ 'ది హాలీవుడ్ రిపోర్టర్' కథనం ప్రకారం.. ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 2.02 బిలియన్ డాలర్లను వసూలు చేసింది. కేవలం గ్లోబల్ మార్కెట్‌లోనే కాకుండా భారతీయ బాక్సాఫీస్ వద్ద కూడా ఈ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఇండియాలో రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఇక్కడ అత్యధిక వసూళ్లు రాబట్టిన హాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. భారీ విజయాలు సాధించిన క్రిస్టోఫర్ నోలన్ చిత్రం 'ది ఒడిస్సీ', 'అబ్సెషన్' రికార్డులను ఇది బద్దలు కొట్టింది. డెస్టిన్ డానియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టామ్ హాలండ్ మరోసారి స్పైడర్ మ్యాన్‌గా అద్భుతమైన నటన కనబరిచారు. జెండయా... మిచెల్ జోన్స్-వాట్సన్ పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో స్పైడర్ మ్యాన్ ఒక కొత్త, శక్తిమంతమైన ప్రతినాయకుడిని ఎదుర్కోవడమే కాకుండా, శారీరకంగా ఊహించని మార్పులకు లోనవుతాడు. ఈ కాన్సెప్ట్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

# బోనాలపై ట్రోలింగ్..

**కన్నీళ్లు పెట్టుకున్న నటి ఫరియా అబ్దుల్లా**





ప్రముఖ నటి, 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియాలో భావోద్వేగానికి లోనయ్యారు. బోనాల పండుగలో పాల్గొన్నందుకు తనను ట్రోల్ చేస్తున్న వారిపై స్పందిస్తూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ద్వేషాన్ని ప్రేమతోనే జయిస్తానని, తన కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తూ ఓ సుదీర్ఘ వీడియోను పోస్ట్ చేశారు. ఇటీవల హైదరాబాద్ పాతబస్తీలోని మీర్ ఆలం మండిలో ఉన్న శ్రీ మహాకాళేశ్వర అమ్మవారి ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఫరియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సంప్రదాయ దుస్తుల్లో బంగారు బోనం ఎత్తుకొని, డప్పు చప్పుళ్లకు ఉత్సాహంగా నృత్యం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అయితే, ముస్లిం నేపథ్యం ఉన్న ఫరియా హిందూ పండుగలో పాలుపంచుకోవడాన్ని సోషల్ మీడియాలోని కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమెను 'కాఫిర్' (మత విశ్వాసం లేని వ్యక్తి) అని సంబోధిస్తూ, మతానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారంటూ దారుణంగా ట్రోల్ చేశారు. ఈ ట్రోలింగ్‌పై ఫరియా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో కన్నీళ్లు పెట్టుకున్నారు. "మా నాన్న (సంజయ్ అబ్దుల్లా) పుట్టుకతో హిందువు. ఆయన ఇస్లాం సిద్ధాంతాలు నచ్చి ఆ మతంలోకి మారారు. ఒక మతాన్ని అంతగా ఇష్టపడి స్వీకరించిన వ్యక్తి నన్ను పెంచినప్పుడు, నాకు అందులోని మంచి విషయాలే కనిపించాయి" అని ఆమె భావోద్వేగంగా చెప్పారు. "నన్ను 'కాఫిర్' అని పిలుస్తూ ద్వేషించే వారికి కూడా మంచి జరగాలనే కోరుకుంటాను. నేను ద్వేషాన్ని ప్రేమతోనే ఎదుర్కొంటాను" అని స్పష్టం చేశారు.

ప్రకృతిలోని చెట్లు, పుట్టలు, సీతాకోకచిలుకలు.. ఇలా ప్రతి అంశంలో తాను దైవాన్ని చూస్తానని ఫరియా తెలిపారు. అన్నింటిలో భగవంతుడిని చూడకపోతే జీవితంలో చాలా కోల్పోతామన్నారు. తన ప్రేమను, భావ ప్రకటన స్వేచ్ఛను ఎవరూ ఆపలేరని, ఇదే తన తిరుగుబాటు అని ఆమె తేల్చిచెప్పారు. ఫరియాకు మద్దతుగా నటి లక్ష్మీ మంచుతో పాటు పలువురు నెటిజన్లు, అభిమానులు నిలుస్తున్నారు.



# ముంతాజ్ ఐకానిక్ లుక్‌ను గుర్తు చేసిన శోభిత..

: టాలీవుడ్ హాట్ బ్యూటీ శోభితా ధూళిపాళ్ల గ్లోబల్ స్థాయిలో తనదైన స్టైల్‌తో మెప్పిస్తు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొత్త ఫోటోలు ఇప్పుడు నెట్టింట సంచలనం సృష్టిస్తున్నాయి. కాంతివంతమైన ఆరెంజ్ రంగు సారీలో వింటేజ్ వైబ్స్, మోడరన్ గ్లామర్ కలగలిపిన రూపంతో అందరినీ ఆకట్టుకున్నారు. బాలీవుడ్ ఐకానిక్ నటి ముంతాజ్ క్లాసిక్ శారీ లుక్‌ను రీక్రియేట్ చేస్తూ ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాషన్ ప్రియులకు సరికొత్త గోల్స్ ఇస్తున్నాయి. ఆ విశేషాలు చూద్దాం..ఆరెంజ్ ఛార్మింగ్‌తో కేక పెట్టిస్తున్న పిక్స్: పచ్చని ప్రకృతి నేపథ్యం ముందు శోభితా ఆరెంజ్ రంగు బంధేజ్ పాటర్న్ చీరలో, దానికి తగినట్లుగా డిజైన్ చేసిన బ్యాక్‌లెస్ బ్లౌజ్‌లో మెరిసిపోయారు. ఇక సూర్యాస్తమయం వెలుగులో ఆమె కట్టిన చీర, ఎంబ్రాయిడరీ బోర్డర్ కాంతివంతంగా మెరుస్తూ రాయల్ లుక్‌ను ఇచ్చాయి. ఈ ఫోటోషూట్‌లో శోభితా నవ్వు, ఆమె ఒలికించిన సొగసు కుర్రకారును మైమరపిస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వినూత్నమైన ఆ స్ఫూర్తి: ఈ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ శోభితా రాసుకొచ్చిన క్యాప్షన్ మరింత ఆసక్తికరంగా మారింది. "ఆరెంజ్ ట్యాంగ్, పింట్రెస్ట్‌లో ముంతాజ్ చీర పిక్, సూర్యాస్తమయం, నిన్న రాత్రి ఫ్రిజ్‌లో దాచిన గాజర్ కా హల్వా, మరియు ససురాల్ గెందా ఫూల్ పాట.. వీటి నుంచే నాకు ఈ లుక్ స్ఫూర్తి లభించింది" అంటూ సరదాగా చెప్పుకొచ్చారు. ఇక ప్రతి అంశాన్ని తన శైలికి అనుగుణంగా మలచుకుని అద్భుతంగా మెరిశారు.

